


# చెంచునాటకం

బి.పి.ప. కుమార్

అప్పుడే తూరుపు తెలతెలవారుతోంది సూర్యుడింకా కొండెక్కలేదు. కాటంరాజమల కొండల్లోంచి చింతలముడుపు చెంచుగూడెంలో కోడి కూసింది.

దానికంటే ముందేలేచి, చిరుగుల దుప్పటి కప్పుకుని మంటకాగుతున్న బుడుసుగాడు నోట్లోని పొగాకురసం తుపుక్కున వుమ్మివేసి, గుడిసెలోకి కళ్ళు రిక్కించి చూచాడు. ఆ మసక వెలుగు చీకటిలో. పెద్దకోడలు కొండమ్మ వళ్ళు తెలియకుండా నిదుర పోతూంది ఒంటరిగా.

బుడుసుగాడు ఆశ్చర్య పోయాడు. ఏనాడూ మాపిటేలకుగానీ, లేవనోడు యింత నడిరేయికే ఏడకిపోయిండబ్బా"! అనుకున్నాడు. కొంచెంసేపాగి కూర్చుని ఆలోచించాడుకానీ, ఏమీ ఆలోచన పోలేదు. ఆఖరికి చిన్న అనుమానంతో చిరొంటి నుంచి యింత సున్నం తీసుకుని పంటికి రాసుకుని చిన్న పుగాకుతుంపు నోట్లో కుక్కకుని పట్లు పట్టిన కాళ్లు మెల్లిగా కూడదీసుకుంటూ లేచి నిలబడ్డాడు. యింతలోనే చిన్నకొడుకు గుడిసెలో నుండి బయటి కొస్తున్న పెద్దకొడుకు బుడుసుగాడి దృష్టిని పడ్డాడు. బుడుసుగాడినోరు కొద్దిగా తెరుచుకుని ఆగిపోయింది. ఆ గుడిసె గుమ్మంలో సన్నగా కనుపిస్తున్న ఎర్రకోక చటుక్కున పక్కకు తప్పుకుంది.

బుడుసుగాడు అలాగే కూర్చుండి పోయాడు మళ్లీ. "ఆరి ఈడి పానుగూల! నా అనుమానమే నిజమయిందే!!సిన్నోడు రాత్రి పొలంలో ఏ గింజల దొంగతానానికో పోయుంటాడు. అదిసూసి ఈడు ఆ గుడిసెలో దూరాడు. ఆడికీ సంగతితెలిస్తే యింకేమైనా వుందా? దబ్బతొక్కి ఈడ్ని ఒక్క ఏటుకి ఎయ్యడూ? యింతకీ ఆ గుడిసేటిదాని



కైనా వుండొద్దా గేనం? యిలాగ ఎన్నాళ్లనుండి సాగుతుందో యవ్వారం!" అనుకున్నాడు. యింతలో పెద్దకొడుకు తలొంచుకొచ్చి స్వంత గుడిసెలో దూరబోయాడు. .

"ఓరి గురివిగా! ఏడకురా పోతివి? యిప్పుడొస్తుండావు?" అన్నాడు బుడుసుగాడు. గుడిసెలో దూరబోయిన గురివిగాడు ఒక్కక్షణం ఆగి తండ్రివయిపు ఎర్రగా చూసి, "నే నేడకుపోతే నీకెందుకురా? కొండముచ్చులాగా ఒకదగ్గర పడుండక అన్నిట్లో ఏలెడతావు!" అంటూ లోపలకు దూరి పెళ్లాం పక్కన పడుకున్నాడు.

బుడుసుగాడికా జవాబుతో వళ్లు మండింది. కానీ ఏమీ చెయ్యలేక గొణగసాగాడు. "నే నీ నాటికి కొండముచ్చునాగే వున్నాన్రా మీ కళ్లకి. అందరూ అదేకూత. అదిసచ్చినతరువాత అమ్మోరు పోసి, యిలాగయ్యానుగానీ, లేకపోతే నీ అంతప్పుడు నే నెలాగున్నానని. దబ్బతొక్కి అంబు యిడిసిపెడితే ఎక్కడున్న కణితైనా తక్కున నేల ఒడాల్సిందే.నా పనిసూసి నా ఈరత్వం సూసి గూడెం వాళ్లంతా నన్ను పెద్దగా ఎంచుకున్నారు.

ఈ నాటికి మీరంతా పెద్దోళ్లై డాబు కూతలు కూత్తున్నారు. నానుంచే కదంట్రా నీకు గూడెపు పెద్దరికం వచ్చింది? లేకపోతే నీ ఈరత్వం సూశా, నిన్ను సూశా? నేను సంపాయించిందంతా తాగుడికే తగలేశావు. అబ్బో! మా వయసులో మేమూ తాగాం రా! కానీ నీలాగ అరచిట్టి సారా తాగి ఆరు రోజులు పడుకోలేదురా. యింట్లో. అరు చిట్లు సారా తాగి నా అరక దున్నుతుంటే అడ్డేలేదు. నా పనిచూసి గవర్నమెంటోడు మెచ్చిండు. పారెస్టరి మెచ్చిండు, రేంజిరి మెచ్చిండు, ఆ డెవడూ! ఆ సీతారామయ్య రేంజిరి నన్నుసూసి,"ఓరి బుడుసుగా నిన్నుసూస్తే నాకు సాలా సంతోషం ఏస్తుంది. నీకు కాడిఎద్దులు యిప్పిస్తాను. నీ పొలంలో బాయి తవ్విస్తాను. సుబ్బరంగా పొలం దున్నుకు బతకరా, అడివి కనిపెట్టుకు బతుకు. రా, యీ సెంచు దొంగల్లాగా దొంగతనానికీ, ఆడకీ పోకురా, అడివి కనిపెట్టుకుని బదుకు. నీకు మరేం ఫర్వాలేదు. అన్నింటికీ నే నున్నాను." అన్నాడు.

ఆ మాట సెప్పిన రెన్నెల్లకే నామీద పైకి బాగా రాశిండేమో, గవర్నమెంటోడు కాడెద్దులు యిచ్చిండు. బాయి తవ్వించిండు. నీళ్లతోడే మిసను పెట్టించిండు. అదిసూసి బయ్యన్నసెల కొండక్రిందవున్న భూమంతా దున్నిపారేశాను. ఏటా మూడుపుట్లు అరికెలూ, రెండుపుట్లు వరిగెలూ, రెండుపుట్లు జొన్నలూ నల్తుం ఆవదాలు, పండించాను. అందరూ మెచ్చింద్రు. ఒల్లుకోకుండా కష్టపడ్డాను.

అలాగుండబట్టే ఎనిమిదుగురి ఆడపిల్లల పెళ్లి సేసాను. మీ యిద్దరి పెళ్లి సేసాను. యిప్పుడో మీరు పెద్దోళ్లైం తర్వాత ఆ ఎద్దులూ, పొలమూ మీ సారాకే పోయాయి. ఆ మిసనుకూడ ముక్కలు ముక్కలు చెడదీసి, అమ్మకు తాగేశారు. యిప్పుడు కాల్లతలేపి యింట్లోకూకున్నారు. రోజా కష్టెలమ్మితేనేగాని నీకు జరుగదు. దొంగతనం సెయ్యకపోతే అడికి జరగదు. మీతోనే నా పరువంతా పోయింది. దొర్నాలబసవయ్యసెట్టికి నేనంటే ఎంతనమ్మకం! ఏనాడైనా అడిగితే లేదనేవాడే కాదు. ఆడికియ్యాలసిన బాకీ ఎగ్గొట్టి మీ రిలాగ తిరగబట్టేకదా యిప్పుడు మనల్ని బొట్టుకు నమ్మడు. రుణం రణం లాంటిది. అది తెలుసుకు బతకాల, లేకపోతే ఎంత బతుకు బతికి ఏం యిది?

యింత సంపాయించి మీ ఎదాన కొట్టాను. యిప్పటికీ, యీ నాటికీకూడా నాకు మీరు యింత తిండి యెయ్యలేక పోతుండ్రు. నేనుగనక గుంతికదిండ్లు, బండినొగలు, బాకులు, అంబులు దబ్బలు యియన్నీ సేసుకు యింత రాగికొరట కాసుకు తాగుతున్నా. లేపోతే నా సంగతేంసేసుందురు? యిదేనా మిమ్మల్ని పెద్దోల్లనిసేసినందుకు నాకు ... యిది!

అసలు మన జాతే అంతలేండ్ర. లేపోతే మనిసి జనమెత్తినతరువాత మనకీ ఈ అడివిబతుకెందుకు పెడతాడా బగమంతుడు. లేపోతే తమ్ముడూ, అన్నా, అయ్యా, అమ్మా అన్నదిలేకుండా తోడబుట్టినోడు యింట్లోలేపోతే ఆ గుడిసెలో దూరటం ఎంతమాట! యిలాటి పని నా కళ్లతో సూడాలసొచ్చి ... .... ....

బుడుసుగాడి వీపుమీద ఎగిరి తన్నాడు గురివిగాడు. "ఏంట్రాకూస్తున్నావ్"అంటూ! అమ్మో అంటూ బుడుసుగాడు ముందుకు తూలి నిప్పులో పడబోయి తట్టుకుని ప్రక్కకు ఎగిరాడు, "నే నెలాగపోతే నీకెందుకురా నాయాల? తిని కూకోనేక వూరికే గుడ్లపెట్టలాగ గుడగుడమంటావ్. సల్లీ నీ గొనుగుడినిపిస్తే దుమ్ము విరగదంతా

జాగర్త" అంటూ వెనుదిరిగాడు గురివిగాడు. బుడిసిగాడి కోపం హద్దులు దాటింది.

"ఓర! నిలబడర!! ఇయాల్టికి నన్ను తన్నే మొనగాడివైనవంట్రా నువ్వు? అది కాదుర మొగోడితనం, దబ్బ తొక్కుకురార, నేనూ దబ్బ తొక్కుతా. యిద్దర్లో ఎవడో ఒకడు ఆటో యిటో అయిపోవాలి. అదీ రోసమంటే. పోలీసోడ్ని సూస్తే అడవిలోకి గుడిసిడిసి పెట్టి పారిపోయే సెది నాయాలవి నీకేడదిరా పౌరుసం? అలా పోతావేంర? రార, నిన్ను పోలేరమ్మకి నిలువునా బలేస్తా, లేపోతే నాపేరు కుడుముల బుడుసుగాడేగాదు" అని పెద్ద గొంతుపెట్టి అరవడం మొదలు పెట్టాడు. గుడిసెదాకా పోయిన గురివిగాడు చటుక్కున తిరిగి ఒక్క అంగలో బుడుసు ఒంగదీసి రెండు గుద్దులు గుద్ది "నిన్న చింతల మువుపుకు బలేస్తా" అని మొలలోని బాకుమీద చెయ్యేశాడు.

అప్పుడే అక్కడకొచ్చిన చిన్నకొడుకు బైగాడు చేలోని దబ్బ, భుజంమీది మూటక్రింద పారేసి చెయ్యి పట్టుకుని తండ్రిని విడిపించాడు. ఆ అదను చూసుకుని బుడుసుగాడు లిట్లకు లంకించుకున్నాడు. తమ్ముడ్ని చూడగానే గురివిగాడు కోపంగా చెయ్యి విదిలించుకొని తన గుడిసెలోకి పోయి పడుకున్నాడు.

అంతసేపూ యిదంతా చూస్తున్న గురివిగాడి భార్య బైగాడివైపు చూసి నవ్వ ఏదో సైగ చేసింది. అందుకున్న బైగాడు తిరిగి సైగ చేసి నవ్వుకుంటూ తన గుడిసెవైపు బయల్దేరాడు.

ఆర్రాత్రి బుడుసుగాడు తన గుడిసెముందు చలిమంట బూడిదలో ముడగదీసుకుని పడుకున్నాడు. గురివిగాడి గుడిసెలో గుడ్డిదీపం భగభగమని మండుతూంది. నడిజాము కానిచ్చి గురివిగాడు మెల్లిగాలేచి పెళ్ళాంవైపు చూశాడు. అది ఒళ్ళెరక్కుండా నిద్ర పోతోంది. యిదే అదననుకుని వాడు లేచి మెల్లగా బయటకొచ్చి బైగాడి గుడిసెలో దూరాడు. వాడికోసమే ఎదురు చూస్తున్న బైగాడి పెళ్ళాం గురమ్మ గబుక్కున దీపం ఆర్పేసింది.

"ఏవే గురవమ్మా! నీ మొగుడు దొంగతనానికి పోయాడాయియాలగూడా" అన్నాడు గురివిగాడు మెల్లగా గుస గుస లాడినట్లు. "ఆఁ! లే పోతె నీలాగ కష్టపడి సంపాయించటం సేతగావద్దా ఆ ఎదవకి" అంది గురమ్మ. మరింక ఎవరి గొంతూ పైకి విన్పించలేదు. గుడిసంతా చిట్ట చీకటి.

యిక్కడ గురివిగాడి గుడిసెలో వాడి పెళ్ళాం నిద్రపోతున్నదల్లా గురివిగాడలా పోగానే గబుక్కున లేచి గుడిసె వెనకాల తుప్పల చాటున దాక్కున్న బైగాడ్ని పిలుచుకువచ్చి గుడిసెలో దూరింది.

"ఓలె కొండమ్మా! ఎప్పుడూ లేంది యింత రేతిరాడ ఏడకు పోయిండే నీమొగుడు? కొంపదీసి దొంగతనానికి గాదు గదా!!" అన్నాడు బైగాడు నవ్వుతూ. "ఆట్పోసి! ఆడికంత దయిర్యం గూడానా! అంత మొనగాడయితే బాగానేవుండు" అంది కొండమ్మ "అయితే యాడేడకు పోయినట్టూ!" అన్నాడు బైగాడు అనుమానంగా. "ఏడసస్తే మనకేంవంట?" అంటూ రెండు చేతులూ బైగాడి మెడలో వేసిందికొండమ్మ. గాజులు గలగల లాడినయ్. భగభగమంటున్న గుడ్డిదీపం ఒక్కసారి పెద్దగా వెలిగి భగ్గుమని ఆరి పోయింది.

తెల్లవారడానికి యింకా చాలా సేపుంది గురివిగాడు తన గుడిసె దగ్గరకొచ్చి గుమ్మంలో నిలబడి బీడీ నోట్లోపెట్టి అగ్గిపుల్ల వెలిగించాడు. దాన్నిబీడీమీద పెడ్తూ ఆ వెలుగులో యింట్లోకి చూసి కొయ్యబారి పోయాడు.

అదీ ఒక్కక్షణమే. మరుక్షణంలో ఓర బైగా అని రంకెవేసి మొలల్లోని బాకు లాగి యింట్లోకి దూకేడు. ఆ అరుపుకు దద్దరిల్లిన బైగాడు మొదటగాభరాపడిలేచినా ఒక్కత్రుటిలో జరిగినదంతా అర్థం చేసుకున్నాడు. అంతే, వాడికెక్కడ లేని బలమూ ఒక్కసారిగా వచ్చినట్టై తనమీదికి బాకుపట్టుకు దూకిన అన్నని అలాగే కాలుతో కడుపులో తన్నాడు. అనుకోని సంఘటన కావడంచేత గురివిగాడు 'అమ్మో' అంటూ ప్రక్కకు పడి పోయాడు. ఇదే అదనని బైగాడు లేచి బయటకు పరిగెత్తి తన గుడిసెలో దూరి దబ్బ తీసుకుని ఆ చీకటిలోనే సుద్ద కురవకొండవైపు పరుగెత్తాడు.

కొంచెం సేపటికి లేచాడు గురివిగాడు. వాడి పెళ్ళాం భయంభయంగా గుమ్మంలోనక్కి నిలబడింది. "ఏవే గుడిసేటి దానా! నేను లే పోడం చూసిఆడ్నెట్టుకు కులుకుతున్నావా ముండా అంటూ జుట్టుపట్టుకున్నాడు. అది అమ్మో అని అరిచి గింజుకోసాగింది.

ఇదంతా అంతకుముందునుండే గుమ్మంలో నిలబడి చూస్తున్న బుడుసుగాడు వచ్చి అడ్డుకోబోయాడు. గురివిగాడు వాడ్ని ఒక్క తోపు తోశాడు కోపంగా. వాడు గుడిసె మూలకి వెళ్ళి పడ్డాడు. గురివిగాడు మళ్ళీ పెళ్ళాన్ని చావ మోదసాగాడు. అది యింక ఓర్వలేక లిట్లకు లేచింది.

"ఓర నీకు గత్తర తగలా! నేనెలాగపోతే నీకెంర? నీయిష్టం వచ్చినట్టు నువ్వు మీతమ్ముడి పెళ్ళాం దగ్గరికి పోడం లేదా? అలాగే నాయిష్టం మొచ్చినట్టు నేను పోతాన్నే. అడగడానికి నువ్వు ఎవడివిర? నేన్నీతోటుండనింక. నీతమ్ముడ్ని తీసుకుని లేసి పోతాను. ఏం చెయ్యి గలవో సూస్తాను. మళ్ళీ నాఒంటిమీద నీ సెయ్యి పడిందా ఆడిసేత నీపానం తీయిస్తా".

గురివిగాడు ఒక్క క్షణం నివ్వెరపోయాడు. మళ్ళీ తమాయించుకొని ఒక గీరనవ్వు నవ్వాడు.

నవ్వుతూనే "ఓలె ఎదవ! నువ్వా నాపాణం తీయించేది! ఆడా నాపాణం తీసేవోడు!! జరిగే పనేనా అంట? ముందాడ్ని పయిటేల లోపల ఎనక ఎడుగుకింద పాతిపెడతా, తరవాత నిన్ను ముక్కలు ముక్కలు నరికినట్టు నరికి కాకులకీ, గెద్దలకీ ఎగరేస్తా, సూసుకోమరి నా తడాకా" అంటూ పెళ్ళాన్ని గుంజకేసి గట్టిగా కట్టేశాడు. అది గింజకొని గోలపెడుతున్నాకూడా. పొయ్యిమూల పెట్టిన దుత్త తీసి సూరులో దోపిన చిట్టి తీసి రెండు చిట్లు పోసుకు తాగాడు. దుత్తమళ్ళీ పొయ్యిమూల పెట్టబోయి ఏమనుకున్నాడో ఏమో మళ్ళ యింకొక చిట్టి పోసుకు తాగి దుత్త, చిట్టి అక్కడే పారేశాడు.

కొన్ని అంబలి, దబ్బ తీసుకొని, నడుముకు పేష్కబ్( బాకు )గట్టిగా బిగించుకొని గుమ్మంలోకొచ్చి నిలబడ్డాడు.

యిదంతా చూస్తున్న బుడుసుగాడు గభాలున వచ్చి వాడ్ని పట్టుకొని "ఓర గురివిగా! ఆడుకూడా నీ నెత్తుర పంచుకొని పుట్టినోడేరా, ఆడ్ని సంపితే నీకేంవస్తదిర? నేను బతికున్నంత వరదాకా తిన్నా తినక పోయినా మీరు గుద్దులాడుకోకండిర, నామాట ఇన" అని బ్రతిమలాడాడు.

గురివిగాడు బీడీ వెలిగించి, తండ్రి చేతుల్ని విదిలించుకొని బైగాడి గుడిసె దగ్గర కొచ్చాడు. గుమ్మంలోనే నిలబడ్డ గురమ్మని చూసి "ఏవే గురవమ్మా! ఎటుబడి పోయిండే నీ మొగుడు? ఆడ్ని యాల కైనా సేత్తా సెప్పు జేగి" అన్నాడు తొందర తొందరగా. గురమ్మ ఏమీ మాట్లాడకుండా నాలుగు ప్రక్కల నిసితంగా చూసి ఎవరూ లేరనితేల్చుకొని గురివిగాడ్ని దగ్గరకు రమ్మని సైగ చేసి వాడలా రాగానే "ఆడు సుద్దకురవ కొండకేసి లగెత్తిండు, నువ్వా అటె వురుకు, దొరికితే ఒదలకు దొంగ నాయాల్ని. ఎక్కడో నరికి పాత రేసిరా" అంది మెల్లిగా.

"సూత్తాండు, సూత్తాండు. ఆడు మళ్ళీ గుడిసెకి తిరిగి రాడం పుట్టేది" అంటూ గురివిగాడు గబగబ నడిచి చీకట్లో కలిసి పోయాడు.

గురివిగాడి గుడిసెలో బుడుసుగాడు పెద్ద కోడలి కట్లిప్పుతూ "ఏవె కొండమ్మా! ఎంతపని సేశావె? ... ! ఆడిప్పు డేంసేసి ఏం పీకెలమీదికి తెస్తడో!" అన్నాడు భయంగా. కొండమ్మ తట్లు దేరిన శరీరం రుద్దుకుంటూ "యింక లాబంలేదు మావా! నువ్వెన్ని సెప్పు, ఆడితో నేనింక కాపరం సెయ్యను" అంది రోషంగా.

"ఎలాగ సస్తె అలాగ సావండి నాకేం! ఆ దొంగనాయాల్లిద్దరూ అలాగంటె ఆల్లకి తగినోల్లే దొరికిండ్రు మీరిద్దరూ. ఆల్లూ మీరూ గల్సి అందరూ నరుక్కొని సావండి. అయిన్నీ నా కల్లబడే ముందే నేనేడకైనా పోయి పానంయిడులా సరిపోద్ది" అని బుడుసుగాడు రుసరుసలాడుకుంటూ తన గుడిసెలోకి పోయాడు.

• • •

పిట్టమధ్యాహ్నం సూర్యుడు వడి నెత్తిన తాండవ మాడుతున్నాడు తన ముక్కోటి జ్వాలల్ని భూమిమీదకు ప్రసరిస్తూ. ఎక్కడా ఆకు అల్లాడడం లేదు. గాలి వుందా లేదా అనిపిస్తుంది. గురివి

గాడు బైగాడ్ని వెతుక్కుంటూ సుద్దకురవ; మేదరి సెలకొండ, బందెళ్లతోక, సలిగుండల కొండ దాటి తుమ్మగుండం చేరుకున్నాడు.

దానికి పదిమైళ్ల లోపున ఏవూరుగాని, ఏ చెంగుగూడెంగాని లేదు. గురివిగాడు బాగా అలసిపోయాడు. ఏమీ తినకుండా బయల్దేరి ప్రొద్దున నుండి మధ్యాహ్నం వరకూ నడుస్తూ వున్నాడేమో బాగా ఆకలికూడా వెయ్యసాగింది. వెతగ్గా వెతగ్గా ఒక వెలగచెట్టు క్రింద అప్పుడే రాలిన మూడు వెలగ్గాయలు దొరికితే అవితిని కడుపుమంట కొంచెం చల్లార్చుకున్నాడు. కాని బాగా దాహం గూడా వెయ్యసాగింది. యింక చేసేది లేక లేని ఓపిక తెచ్చుకొని అక్కడకు ఒక అరమైలు దూరంలో వున్న పణుకు మడుగు చేరుకున్నాడు.

అది పేరుకు మడుగే కాని ఆమధ్య సరిగా వానలు లేకపోవడంచేత ఎండకు బాగా ఎండిపోయింది. దాన్లో మూడు నాలుగు దుత్తల మురికి నీరు కంటె ఎక్కువ లేదు. ఆనీరే కొంచెం తాగి కదిలే ఓపిక లేక అక్కడే, ఒక చెట్టుకింద నడుం వాల్చాడు గిరివిగాడు. బాగా అలసివున్నాడేమో పడుకోగానే నిద్రపోయాడు.

బైగాడు బయల్దేరు తూనే పదిగంటల వేళకు తుమ్మగుండంచేరుకున్నాడు. అప్పటినుండి వాడికీ తిండి, నీరూ లేదు. తిరిగితిరిగి వాడు ఒక చెట్టు క్రింద నిద్రపోయాడు. సాయంత్రం నాలుగ్గంటలకు మెళకువ వచ్చేసరికి గాభరాపడి లేచి అటూ యిటూ చూశాడు. దగ్గర్లో ఏ అలికిడీ వినరాలేదు. దూరంగా ఏదో పిట్ట కీచుకీచుమని అరుస్తోంది.

ఆకలికి బైగాడి కడుపులో పేగులరుస్తున్నాయి. అంతవరకూ రెండు మూడు రోజుల వరకూ యింటికి పోగూడదని అనుకున్న బైగాడి నిశ్చయం ఆకలితో పటాపంచలయిపోయింది. ఎక్కడనుండో ధైర్యం పుట్టుకొచ్చింది.

"ఆడా నన్ను సంపేవోడు! ఆడికి జడిసి యింత దూరం పారిపోతే నన్నందరూ సోది యెదవఅనరూ! అలాగ్గాదు ఆడికి నేనే ఎదురెల్తాను. నాలుగు సిట్లుతాగానంటే ఆడే గాదు, ఆడి అబ్బనుగూడా కొండల్లోకి ఎంట తగుల్తాను. నేనేనా అంత సోదోడ్ని? సూపిత్తాను నా ఈరత్వం" అనుకుంకుంటూ తిరుగు మొహం పట్టాడు బైగాడు.

మధ్య దారిలో చింత చెట్టొకటి కన్పిస్తే అదెక్కి సుమారు ఒక వీసెడు చింతపండు కోశాడు క్రిందకు దిగి సావకాశంగా కూర్చుని అదంతా మెల్లిగా మింగాడు. యింక మంచినీళ్లు కావలసి వచ్చాయి. వెంటనే పణుకు మడుగువైపు దారి తీశాడు.

పణుకు మడుగుకు ఇరవై మూర్ల గజాల దూరంలో వున్నాడనగా ఏదో పులి అరుపు, దానితోనే ఎవరో పెద్దగా వేసిన కేక విన్పించి చటుక్కున ఆగిపోయాడు. మరుక్షణంలో దబ్బలొక్క అంబు రిక్కించి శబ్దం వచ్చిన వైపు పరిగెత్తాడు లేడిలా. మడుగుకు దగ్గరగానే ఒక చెట్టుక్రింద ఎవరో ఒక మనిషి, ఒక పులి కుస్తీపట్లు పడుతున్నారు. అది చూసిన బైగాడు ఒక్క క్షణమైన ఆలస్యం చెయ్యకుండా నారిసాగదీసి అంబు ఒదిలాడు.

అది సరాసరి పులి వొసట రెండు కళ్లకు మధ్యగా అడుగు లోతుకు దూసుకు పోయింది. సర్రుమంటూ. అంతే, పులి అలాగే వెనక్కు వ్రాలిపోయింది పెద్దగా ఘర్జిస్తూ. కొంచెం సేవు చూసి మెల్లిగా అడుగులో అడుగులేసుకుంటూ దాని దగ్గరకు చేరాడు బైగాడు. కాలితో దాన్ని అటూ యిటూ కదిపి చూశాడు. అది దాని అవతారం చాలించుకుందని తెలుసుకుని ప్రక్కనే కదలక మెదలక పడున్న మనిషివైపు చూసి త్రుళ్లి పడ్డాడు.

"అరి ఈడికి గత్తర తగలా! నన్ను సంపనాన్ని





## లేదు, నిశ్చయంగా అట్లుచేయరు !

కాని, చాలా అప్రతిష్ట గలిగించునట్టి పూర్తిగా నెరిసిన శిరోజాలుగలతలతో జీవితం ఎవరికైనా తరుచు ఆశాభంగముతో విసుగుగానుండును.

విజ్ఞానం, అద్భుతమార్పులను గలిగించిన ఈనాటి ప్రపంచంలో నెరిసిన శిరోజాలగురించి ఎవ్వరూ చింతించ నక్కర్లేదు. ఎందుచేతననగా శిరోజాలను నలుపుచేయునట్టి దివ్యమైన తలనూనె "లోమ" అతి సురక్షితంగాను, అతి త్వరితంగాను మీ శిరోజాలను యౌవనవంతమొనర్చే సాధన. "లోమ" యొక్క మనోహరమైన పరిమళం లక్షలాది జనులకు ప్రీతైనది. అందుచేతనే శిరోజాలను నలుపుచేసే తదితర సాధనలన్నింటిలో అది ప్రాముఖ్యతగా అగ్రస్థానమును వహించియున్నది.



సొగసుగా నుండుటకు

లోమ

వాసి తల దువ్వుకోండి

సోల్ ఏజెంట్లు: ఎమ్. ఎమ్. ఖంభట్ వాలా
అహమదాబాద్ 1, భారత దేశం

ఏజెంట్లు: సి. నరోత్తమ్ అండ్ కొ.
బొంబాయి-2.

కొచ్చినోడు ఈడే దీని సేతుల్లో సచ్చిండే!" అనుకుంటూ గబుక్కున ఒంగి ముక్కుదగ్గర వేలుపెట్టి చూశాడు. కొన్ని నిముషలకు గురివిగాడు స్పృహలోకి వచ్చాడు. మెల్లిగా కళ్ళు తెరిచి ఎదురుగావున్న బైగాడ్ని చూసి ఆశ్చర్యంగా కనుబొమలు ఎగరేశాడు. తర్వాత వాడిదృష్టి తన, శరీరం మీద ప్రసరించింది. గుండె దగ్గర పులి పంజాతగిలి బయటకు వచ్చిన కండ, అక్కడ మడుగులా కారిన ఎర్రని చిక్కని రక్తం చూడగానే వాడికళ్ళు గిర్రున తిరిగినయి. ప్రక్కనే పడివున్న పులిని చూడగానే వాడికి మళ్ళీ స్పృహ తప్పి పోయింది.

"అరి! యీడుత్త సొది నాయాల లాగున్నాడే మళ్ళీ మతి తప్పి పోయిండు" అనుకున్నబైగాడు యింక చేసేదిలేక గురివిగాడ్ని బుజాని కెత్తుకుని అంబులు దబ్బ తీసుకుని యింటివైపు దారి తీశాడు.

"పొద్దున్ననగా పోయిన యీపడుసులు యింతవరదాకా తిరిగి రాలేదు. ఒకడుగా పోతే ఒకడైనా తిరిగిరావద్దా! మద్దెలో ఏమైనా యిశేసం జరిగిందా కొంపదీసి! ఏది జరిగినా తెలుసుకోనానికి చటుక్కున నలగెత్తనానికి నాకీ కాళ్ళు పట్నుసేత సేతగాపోయె. ఏం సేదు నబ్బా!" అంటూ విచారిస్తున్న బుడుసుగాడు దూరంగా వస్తున్న బైగాడ్ని చూసి గబగబ వాడి కెదరుగా వెళ్ళాడు.

వస్తున్న బైగాడ్ని దెబ్బతిని ఒళ్ళంతా రక్తం మరకలతో స్పృహతప్పి వాడి బుజంమీద పడివున్న గురివిగాడ్ని చూసిన బుడుసు గాడు "అమ్మో! ఏంజరిగిందిర నాపడుసుకి? బతికున్నాడా, సచ్చిండా"? అని అడిగాడు ఆత్రుతగా. బైగాడు ఏమీ జవాబు చెప్పకుండా చేతిలోని దబ్బ వాడికిచ్చి గుడిసె వైపు నడవసాగాడు.

"ఓర బైగా! నిలబడర, నీ....—నిన్ను ఎంపనానికి వచ్చినోడ్ని నువ్వే సావనూకినవంట్ర? సెప్పర...... నిలబడర, లేపోతే నిన్ని ఏటుకేస్తా" పౌరుషంతో వూగిపోతూ దబ్బ లొక్కినారి టంగుమని పించాడు బుడుసు గాడు.

అదివిన్న బైగాడు చటుక్కున ఆగి వెనక్కు తిరిగి "ఓర నీతొందర దొంగల్దోల! నేనీడ్ని సావనూక లేదురా, ఆడే పులిసేతిలో సిక్కితే దాన్ని నేను ఏటేసి సావనూకినా. ఈడ్ని తుమ్మగుండం కాడ్నించి గాడిదను మోసినట్టు మోసుకొస్తున్నా" అన్నాడు.

ఈ మాటలంటూనే గుడిసెలో దూరి గురివిగాడ్ని చాపమీద పడుకోబెట్టాడు బైగాడు. "అయ్యో నా పడుసో! ఎంత పని జరిగి పోయిందిరో, ఆడ్ని నంపనానికి వెళ్ళి నువ్వే సచ్చావు గదరో, ఆపులిని నీపానానికెక్కడ దొరికిందో దానికి గత్తర తగలా" అంటూ కొంచంసెపు ఏడ్చాడు బుడుసుగాడు. ఏమీఎరగనట్టు కొండమ్మ గురమ్మ గుడ్లనీరు కుక్కుకుంటున్నారు బైగాడు మాత్రం గురివిగాడి ప్రక్కనే కూర్చుని వాడి వైపు తదేక దీక్షతో చూస్తున్నాడు.

కొంచం సేపటికి "ఓర బైగా! నువ్విడ్ని జాగర్తగా సూస్తూండు. నేనెల్లి బిందెడాకు తిసుకొచ్చి కట్టుకడతా" అంటూ అడివిలోకి బయల్దేరాడు బుడుసుగాడు.

మూడు రాత్రులు, రెండు పగళ్ళు అందరూ నిద్రహారాల్లేక కష్టపడి అడ్డమైన ఆకులూ తీసుకొచ్చి కట్లు కట్టి గురివిగాడ్ని బ్రతికించుకున్నారు. మూడవనాటి పగలు పదిగంటల వేళకు కళ్ళు తెరచాడు గురివిగాడు. తనచుట్టూ కూరుచున్న తండ్రిని, తమ్ముణ్ణి, భార్యను, మరదల్ని చూసి సిగ్గుతో తలవంచుకున్నాడు.

పదిపది హేను రోజులకు బాగా తేరుకున్నాడు గురివిగాడు. ఒకనాడు బుడుసుగాడు తన గూడెంలో వున్న వాళ్ళందర్నీ పిల్చుకు వొచ్చాడు. దాసరి లంకడు, పులిచెర్ల పెద్ద గురవడు, చిన్న గురవడు, కుడుముల నాగడు, నాగుల జగ్గడు, జుట్టుగాడు, బొందిగాడు, ఎంకటోడు తదితరు అందరూ పిల్లా జల్లాతో సహా బుడుసుగాడి గుడిసెదగ్గర గుమి గూడారు.

అందర్నీ రానిచ్చి బుడుసుగాడు కొడుకులిద్దర్నీ చెరొకవైపూ కూర్చో పెట్టుకొని, తనొక చిన్న ముక్కాలి పీట మీద కూర్చున్నాడు. తర్వాత వుపన్యాసం మొదలు పెట్టాడు. మీరంతా నేను సెప్పేది సరిగ్గా యినండి. నేను ఈ గూడేనికి పెద్దన్ని అవునా కాదా? నేను సెప్పింది యిని తప్పంటె ఎవురైనా సెప్పండి. లేపోతే అందరూ ఒప్పందాని కొచ్చినట్టు సెప్పండి" అన్నాడు. అందరూ అలాగే అన్నారు. బుడుసుగాడు కొడుకు లిద్దరివైపూచూశాడు మీరేమంటారు అన్నట్టుగా.

కొడుకులిద్దరూ సరే నన్నారు. యింక బుడుసుగాడు మొదలుపెట్టాడు.

"ఏదోతెల్సో, తెలీకో నాపెద్దపడును గురివిగాడు సిన్నోడిపెళ్ళాన్ని తగులుకున్నాడు. దానికీ ఆడిమీదే మోజెక్కువ. యింక సిన్నోడిసంగతి ఆడుగూడా జబ్బోడేంగాదు. పెద్దోడు సేసి ఎనికి తగినలాగా ఆడిపెళ్ళాన్ని ఈడు తగులుకున్నాడు. దీనికీ మొగుడి మీదకంటె పరిది మీదే మోజు. ఈసంగతంతా నాకు ముందునుండే ఎరికే. అంసేత నేనుసెప్పినట్టు ఆల్లిద్దరూ యింటానంటె ఒక వుపాయంసెప్తాను. ఏమంటారు ?" అందరివైపూ చూశాడు బుడుసుగాడు.

"సెప్పు, సెప్పు" అన్నారంతా గురివిగాడూ బైగాడూ సిగ్గుతో తలలొంచుకొని "సెప్పయ్యా ఒప్పుకుంటాం" అన్నారు.

"మరేంగాదు. ఈమద్దెన నాదగ్గరున్న డబ్బుతోటి మూడుమల్ల బెల్లం కొన్నాను. లంజమోటు అంతా తిరిగి ఎతికెతికి మంచితుమ్మ సెక్క తీసుకొచ్చి వూరెసి బట్టీపెట్టాను. ఇరవై సీసాలు అగ్గిలాటిసారా దిగింది. యిడవల్లిల్లి బచ్చెట్టి దగ్గర అయిదేసి రూపాయలెట్టి రెండుకొత్తసీరలు గూడా కొన్నాను. దోర్నాలగోను గుంటోళ్ళకొట్లో రెండు రయికలుగూడాకొన్నాను మీరంతా ఒప్పందం అయితే ఆ సీరలూ, రయికలూ కొండమ్మ కొకటీ, గురమ్మ కొకటి ఎడతాను. గురివిగాడికీ, గురమ్మకీ, బైగాడికీ, కొండమ్మకీ మీ అందరి ఎదటూపెళ్ళి సేసేస్తాను అందరం సారా సర్దాగా తాగుదాం, గెంతుదాం, సెంచునాటకం ఆడేద్దాం" అన్నాడు గబాజా అప్పటికి నాలుగు చిప్లేసుకున్న బుడుసుగాడు.

అంతా "సరే, సరే" అని పెద్ద కేకలేశారు. బైగాడుకూడా అలాగేఅన్నాడింకాసిగ్గుపడుతూనే. గురివిగాడుమాత్రం సంతోషంతోకళ్ళు తడుపుకొని తండ్రి రెండుచేతులూ పట్టుకొని "ఓరయ్యా! యింతకుముందు నేను శాలా అన్యాయం సేశాను నీకు. నువ్వింత మంచోడివని తెలీక సేతికొచ్చిన దెబ్బ కొట్టాను. నన్నుసమించు. యియాల్టి నుండీ నువ్వుసెప్పినమాట దాటను. నీయిష్టం వచ్చినట్టుసెయ్" అన్నాడు.

ఆమాటవిన్న బుడుసుగాడు సంతోషంతో పొంగిపోయాడు. వెంటనే గుడిసెలోదూరి పెద్ద కుండ తీసుకొచ్చాడు బయటకు. మళ్ళీ పరుగెత్తికెళ్ళి రెండుచీరలూ, రవికలూ తీసుకొచ్చాడు, గూడెంలోని ఆడవాళ్ళంతా కలిసి కొండమ్మనూ గురమ్మనూ తీసుకెళ్ళి సుభ్రంగా తలంటుస్నానం చేయించి కొత్తబట్టలు కట్టబెట్టారు. ఆడా మొగా పిల్లాజెల్లా కలిసి తలారెండుమూడ్లు చిట్లు ఏసుకున్నారు.

పులిచెర్ల పెద్దగురవడు తప్పెట తీసుకొని ఏశాడు రెండుదెబ్బలు ధన్‌ధన్ మంటూ యిద్దరు పెళ్లికూతుర్లూ, యిద్దరు పెళ్లికొడుకులూ చేతులు పట్టుకొని గిరగిర తిరుగుతూవుంటే వయసులో వున్నవాళ్ళంతా వాళ్ళచుట్టూచేరి పెద్ద పెద్ద కేకలువేస్తూ గెంతసాగారు.

ముసలివాళ్ళంతా ఒకదగ్గర కూర్చొని చెంచునాటకం పాడడం మొదలుపెట్టారు. "సెట్టు లెక్కగలవా ఓనరఅరి పుట్టలెక్కగలవా, సెట్టు మీదున్న సిరత గండును ఏటుకెయ్యగలవా ఓనరఅరి ఏటుకెయ్యగలవా ?"

మెల్లమెల్లిగా సూర్యుడు పడమటి కొండల్లోకి తాగినవాడు తూలినట్టు పడిపోయాడు.

★